క్లుప్తంగా

మంత్రి పొన్నంను కలిసిన కొలిపాక సతీశ్



స్టేషన్‌ఘన్‌పూర్: హైదరాబాద్ లోని సెక్రటేరియేట్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఘన్‌పూర్‌కు చెందిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొలిపాక సతీశ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. షేక్ జానీ, గట్టు నరేందర్ ఉన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



జఫర్‌గఢ్: మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బానోత్ రాజేష్‌నాయక్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు హనుమకొండలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. మాజీ ఎంపీటీసీ దేవేందర్‌నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాటికాయల రాజేందర్, కుక్కల సారంగం, అన్నెబోయిన నాగరాజు, చావన బోయిన సందీప్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం



జనగామ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని 11వ వార్డు అధ్యక్షుడు ఎనగందుల కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దండు ఉపేందర్, అంకం తిరుమలేష్, కొండ మల్లికార్జున్, కుందారం గణేష్ శనివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి సత్కరించారు. అనంతనం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాగపురి



టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్‌రెడ్డిని శనివారం రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని సత్కరించి, జ్ఞాపికను అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాలకుర్తి టౌన్: డీసీఎంవ్యాన్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో మండలంలోని దర్దేపల్లి గ్రామాంలో శనివారం ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన పెంతల మోహన్, వరంగల్ జిల్లాలోని రామకృష్టాపురానికి చెందిన పెండ్లి సోమలక్ష్మి దర్దేపల్లి గ్రామ శివారులోని గూడోల్లగూడెంలో బంధువు మృతి చెందగా అంత్యక్రియలకు వచ్చి తిరిగి స్వగ్రామాలకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో పాలకుర్తి నుంచి నాంచారిమాడూరు వైపువెళ్తున్న డీసీఎం వ్యాన్ దర్దేపల్లి శివారులో ఢీకొట్టింది. ఈ ఘటనలో మోహన్ తలకు బలమైన గాయాలు కావడంతో పాటు సోమలక్ష్మి కాళ్లు విరిగాయి, క్షతగాత్రులను స్థానికులు హనుమకొండ ఆస్పత్రికి తరలించారు. మోహన్ పరిస్థితి విషమంగా ఉంది. మోహన్ కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

యశ్వంతాపూర్‌లో..

జనగామ రూరల్: ద్విచక్ర వాహనంపై వస్తున్న భార్యాభర్తలను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం యశ్వంతాపూర్ గ్రామంలోని బస్‌స్టాప్ వద్ద చోటు చేసుకుంది. జనగామ నుంచి యశ్వంతాపూర్‌కు ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై వస్తున్న మారబోయిన కొమురయ్య, బొందమ్మలను హనుమకొండ నుంచి ఎదురుగా వచ్చిన బస్సు ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అంతా గంపగుత్తే..!

- వరినాట్లకు రోజువారీ కూలి లేదు
- ఎకరానికి రూ.5,500
- వలస కూలీలతో రెండేళ్లుగా వరి నాట్లు
- ఉత్తరాఖండ్, ఏపీ రాష్ట్రాల నుంచి కూలీలు



బండ్లగూడెంలో నాట్లు వేస్తున్న గుంటూరు కూలీలు

లింగాలఘణపురం: వరి నాట్లలో కూలీల విధానంలో మార్పు వచ్చింది. గతంలో మాదిరిగా రోజువారీ కూలీలు కరువయ్యారు. అంతా గంపగుత్తగా ఎకరానికి ఎంత అనే విధానంతో మాట్లాడుకొని నాట్లు వేస్తున్నారు. స్థానికంగా కూలీల కొరత ఏర్పడిన నేపథ్యంలో గత రెండేళ్లుగా మండలంలోని జీడికల్, కళ్లెం, బండ్లగూడెం, వనపర్తి, వడిచర్ల, లింగాలఘణపురం తదితర గ్రామాల్లో ఉత్తరాఖండ్, బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వలస కూలీలు వస్తున్నారు. వీరంతా ఎకరానికి రూ.5,500ల చొప్పున నారు వారే తీసి నాట్లు వేస్తున్నారు. దీంతో రైతులు సైతం వలస కూలీలతోనే నాట్లు వేయించుకుంటున్నారు. ఒక్కొక్క బ్యాచ్‌లో 20 నుంచి 30 మంది కూలీలు ఉంటూ రోజుకు 6 నుంచి 7 ఎకరాల వరకు నాట్లు వేస్తున్నారు. ఇలా వలస కూలీలు గంపగుత్తగా నాట్లు వేయడంతో స్థానిక కూలీలు కూడా రోజువారీ కూలికి నాట్లు వేసేందుకు రావడంలేదు. వారు కూడా గంపగుత్తగా ఎకరానికి ఎంత ఇస్తారని మాట్లాడుకుని నాట్లు వేస్తున్నారు. గంపగుత్తగా ఇవ్వడంతో వారికి సమయంతో పని లేకుండా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కూడ పనులు చేస్తున్నారు. ఇలా ఉత్తరాఖండ్ కూలీలు రెండు నెలల్లో ఒక్కొక్కరికి రూ.25వేల నుంచి రూ.30వేల కూలి లభిస్తుంది. ఏడాదికి రెండు సీజన్లు ఇలా వలస కూలీలు వచ్చి నాట్లు వేస్తున్నారు. రోజువారి కూలి రూ.300లు ఇచ్చి నాట్లు వేయించుకొనే చిన్నసన్నకారు రైతులు గంపగుత్తతో కొంత ఇబ్బందులు పడుతున్నారు.

ఉత్తరాఖండ్‌లో మార్చిలో నాట్లు..

ఉత్తరాఖండ్‌లో వరినాట్లు మార్చిలో వేయడంతో అక్కడి కూలీలు తెలంగాణకు వలస వస్తున్నారు. సుమారు రెండు నెలల పాటు ఇక్కడ కూలి లభిస్తోంది. వీరితో ఆ ప్రాంతానికి చెందిన ఓ మేస్త్రీ ఉంటాడు. ఆ మేస్త్రీ స్థానికంగా మరోరైతును కలుపుకుని రోజువారి పనులను రైతుల వద్ద మాట్లాడుకొస్తారు. ఉదయం లేవగానే పనికి వెళ్లడమే వారి పని.. పని వద్దకు ట్రాలీ, ఆటోల్లో కూలీలను చేరవేస్తారు.

గుంటూరులో యాసంగిలో ఆరుతడి పంటలే

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో యాసంగిలో వరి నాట్లు వేయకపోవడంతో అక్కడి కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తుంటారు. ఆరుతడి పంటలైన మినుములు ఎక్కువగా వేయడంతో అక్కడ పనులు లేక ఇతర ప్రాంతాలకు వెళ్తుంటామని చెబుతున్నారు. తెలంగాణతో పాటు తిరుపతి, చెన్నై ప్రాంతాలకు కూడా వెళ్లి కూలీ పనులు చేస్తారు. వీరికి కూడా ఓ మేస్త్రీ పనులను చూస్తాడు. రైతుల వద్ద ఎకరానికి రూ.5,500లు తీసుకుని కూలీలకు మాత్రం రూ.4,600లు చెల్లిస్తారు.



నారు తీస్తున్న మగ కూలీలు



పొలం వద్దే భోజనం చేస్తున్న ఉత్తరాఖండ్ కూలీలు

రెండో పంటకు నీరు ఉండదు..



గుంటూరులో రెండో పంటలకు నీరు ఉండదు. అక్కడ నాట్లు వేయరు..మినుములు చల్లుతారు.. దీంతో పనులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస కూలీలుగా వెళ్తుంటాం. వరి నాట్లు వేస్తే ఎకరానికి రూ.4,600లు ఇస్తారు. రైతుల వద్ద ఎంత తీసుకుంటారో తెలియదు.

\- కె.విజయకుమారి, బాపట్ల, అడవులదీవి

రెండు నెలల్లో రూ. 30వేలు వస్తాయి



రెండు నెలలు ఇక్కడే కూలీ పనులు చేస్తాం. మా బ్యాచ్‌లో 20 మందిమి ఉన్నాం. రోజుకు ఐదు నుంచి ఆరు ఎకరాలు నాట్లు వేస్తాం. రెండు నెలల్లో ఒక్కొక్కరికి రూ.25వేల నుంచి రూ.30వేల వరకు మిగులుతాయి.

\- మంగల్, సుందర్‌పూర్, ఉత్తరాఖండ్

రెండేళ్లుగా వలస కూలీలను తీసుకొస్తున్నా..



స్థానిక కూలీల ఇబ్బందులతో రెండేళ్లుగా వలస కూలీలను తీసుకొస్తున్నా. రెండేళ్ల క్రితం పొలం రొప్పి నాటు వేసేందుకు సిద్ధం చేసి 15 రోజులు కూలీల చుట్టూ తిరిగా..ఎవరు రాలేదు. దీంతో విసిగి ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి నాటు వేశా. అప్పటి నుంచి వారిని ప్రతి సంవత్సరం రెండుసార్లు ఇక్కడికి తీసుకొస్తా.

\- కళ్లెపు లక్ష్మీనారాయణ, లింగాలఘణపురం

రాష్ట్రస్థాయికి ఎంపిక



కీర్తిప్రియ



వైష్ణవి

కొడకండ్ల: రాష్ట్ర స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌కు మండలకేంద్రంలోని టీజీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనారు. శనివారం జిల్లా కేంద్రంలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టిలెంట్ టెస్ట్‌లో గురుకులానికి చెందిన జి.కీర్తిప్రియ, పి.వైష్ణవిలు ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

మల్కాపూర్ విద్యార్థిని ప్రతిభ



చిల్పూరు: మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని మహ్మద్ ఆశ్ర జిల్లా కేంద్రంలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యాన నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి రెండో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

అభినందనలు



నర్మెట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థి సాయివంశీ జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో మొదటి బహుమతి సాధించాడు. కాగా, సాయివంశీని ప్రిన్సిపాల్ పుష్పకుమారి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు తదితరులు శనివారం అభినందనలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



జూట్ బ్యాగులతో విద్యార్థులు

జనగామ: పర్యావరణ పరిరక్షణ కోసం వివేకానంద సేవా సమితి కృషి చేస్తోందని సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతుల శేఖర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ ఐటీఐలో సమితి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రకృతితో మమేకమై జీవించినప్పుడే మానవ మనుగడ సాఫీగా సాగుతుందన్నారు. మనిషి సుఖసంతోషాల కోసం ప్రకృతిని విధ్వంసం చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో ప్రకృతి విపత్తులతో మానవ మనుడ ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించి, నీటి వృథాను అరికట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం తమవంతు బాధ్యతగా జూట్ బ్యాగులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు గుజ్జుల వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, ఆనంద్, పద్మ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులు

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మామ, అమెరికాలోని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు హనుమండ్ల రాజేందర్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అలాగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిలు రాజేందర్‌రెడ్డితో కేక్ కట్ చేయించి శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని టెంపుల్ కాలనీప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. తొర్రూరు, పాలకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్లు తిరుపతిరెడ్డి, లావుడ్యి మంజుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, పాలకుర్తి, కొడండ్ల, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. కాగా, రాజేందర్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని కొడకండ్లలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రీవెన్స్ ఫిర్యాదుపై విచారణ



విచారణ చేపడుతున్న డీఏఓ రామారావు

స్టేషన్‌ఘన్‌పూర్: వృద్ధాప్య పింఛన్ వచ్చే వారికి రైతుబీమా ఇప్పించారు.. ఎస్‌బీఐ పాయింట్ నిర్వహిస్తున్న తమపై కొందరు ఉద్దేశపూర్వకంగా ఛీటింగ్ కేసు పెట్టడంతో కుటుంబం ఉపాధి కోల్పోయింది.. న్యాయం చేయాలని మీదికొండ గ్రామానికి చెందిన జోగు కుమార్ ఇటీవల గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం డీఏఓ రామారావు, ఏఓ చంద్రన్‌కుమార్ ఆధ్వర్యాన గ్రామంలో విచారణ చేపట్టారు. రైతుబీమా విషయంలో జోగు బాలకొమురయ్య కుటుంబానికి చెందిన డబ్బులు కాజేశారనే విషయమై బాధితుల వాంగ్మూలంతో పాటు గ్రీవెన్స్ ఫిర్యాదుదారు జోగు కుమార్ వాంగ్మూలాన్ని సేకరించారు. ఈ విషయమై డీఏఓ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని, నివేదికను ఆయనకు సమర్పించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరబోయిన యాదగిరి, పొన్నం రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నర్మెట: ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడిగా భూక్య కృష్ణ నియామకమయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవీ రావడానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడుతానని తెలిపారు.

అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి



మాట్లాడుతున్న కనకారెడ్డి

జనగామ రూరల్: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు రాపర్తి రాజు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ల స్థలాలు లేని పేదలందరికీ 120 గజాల చొప్పున స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టలు ఇచ్చి కనీస సౌకర్యాలు ఇవ్వాలని ఈనెల 6వ తేదీన కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నర్మెట్ట మండలం వెల్దండ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం హైకోర్టును ఆశ్రయించిన పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇర్రి అహల్య, సంబరాజు యాదగిరి, రాపర్తి సోమన్న, బొట్ల శేఖర్, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, బూడిది గోపి, పోతుకునూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి పరిరక్షణకు దోహదపడాలి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి



సామగ్రి అందుకున్న ఉపాధ్యాయులతో మహిపాల్‌రెడ్డి తదితరులు

దేవరుప్పుల : సమాజ నిర్మాణంలో కీలక భూమిక పోషించే ఉపాధ్యాయ వృత్తి పరిరక్షణకు నూతన ఉపాధ్యాయులు దోహదపడాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక హైస్కూల్‌లో ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ దేవరుప్పుల మండల శాఖ ఆధ్వర్యాన నూతనంగా నియామకమైన 40 మంది ఉపాధ్యాయులకు సేవాపుస్తకాలు(సర్వీస్ బుక్), నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలబాలికలు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి, హెచ్‌ఎం విష్ణువర్ధన్ రెడ్డి, అంబటి అంజయ్య, గోలి తిరుపతిరెడ్డి, దోసపాటి శ్రీనివాస్, సోమరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

'బీసీల ద్రోహి బీఆర్ఎస్'

బచ్చన్నపేట: కల్వకుంట్ల కవితకు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని బీసీలు ఇప్పుడు గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందని, బీఆర్ఎస్ పార్టీ బీసీల ద్రోహి అని కాంగ్రెస్ నాయకుడు నిడిగొండ శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణ అధ్యక్షుడు దాచేపల్లి నర్సింగారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జనాభా దామాషా ప్రకారం బీజీలకు రిజర్వేషన్ కల్పించాలనే ఉద్దేశంతో కులగణన చేపట్టి డెడికేషన్ కమిటీని ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంలోని సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర అధ్యక్ష పదవీని బీసీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్లగోని బాలకిషన్‌గౌడ్, వేముల వెంకట్‌గౌడ్, మసూద్, బాల్‌రాజు, రమేష్, కవిత, శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

పేలుళ్లలో మండల వాసి మృతి



కనుకయ్య (ఫైల్)

బచ్చన్నపేట: బాంబుల ఫ్యాక్టరీలో జరిగిన పేలుళ్లలో బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన మార్క కనుకయ్య (54) గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని పెద్ద కందుకూరులో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..పెద్ద కందుకూరు శివారులోని ప్రీమియం ఎక్స్‌ప్లోజివ్స్ కంపనీలో కనుకయ్య 25 సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఉదయం కంపెనీలో పీఆర్‌టీసీ బిల్డింగ్-3లో పెల్లెట్ ఫార్ములా తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలుడు సంభవించడంతో కనుకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన యాజమాన్యం చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య కవిత, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు వినయ్ హైదరాబాద్‌లో, కూతురు చంద్రిక లండన్‌లో ఉద్యోగం చేస్తున్నారు. మృతదేహాన్ని స్వగ్రామమైన బచ్చన్నపేటకు తీసుకొచ్చారు. కనుకయ్య మృతితో గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి. నేడు (ఆదివారం) అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శం

దేవరుప్పుల: వంటింటికే పరిమితమైన మహిళలను సమాజ నిర్మాణంలో కీలక భూమిక పోషించేలా దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శప్రాయమని తరిగొప్పుల ఎంఈఓ జానకి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతి-మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిన తరుణంలో 'ఉపాధ్యాయినిగా సావిత్రీబాయి పూలే నిర్వహించిన పాత్ర-అధిగమించిన సవాళ్లు' అనే అంశంపై ఎంఈఓ జి.కళావతి అధ్యక్షతన మహిళా ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది టీచర్లు పేపర్ ప్రజెంటేషన్ చేశారు. అనంతరం మండల విద్యాశాఖ తరపున సర్టిఫికెట్లు, జ్ఞాపికలతో వారిని సత్కరించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు రాజేంద్ర కుమార్, విష్ణు, సుచిత్రానంద్, పద్మావతి, లలిత, మాలతీ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి

దేవరుప్పుల: మండలంలోని పడమటితండా అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులు శనివారం యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ గండిపెల్లి రామతార మాట్లాడుతూ కౌమర దశ బాలికల నుంచి పుట్టిన ప్రతి శిశువు అభ్యున్నతితోపాటు ఓనమాలు నేర్పేందుకు దోహదపడుతున్న తమ సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాటోత్ వీరన్న, విజయ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఖాజానగండితండాలో..

జఫర్‌గఢ్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని రేగడితండా గ్రామ శివారు ఖాజానగండితండా అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనిత చిన్నారులకు శనివారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్ వీణారాణితో పాటు ఆయా పిల్లల తల్లులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జనగామ రూరల్ : శామీర్‌పేట గ్రామానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సర్వాల నర్సింగరావు సతీమణి సర్వాల లలిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, విష యం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని లలిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

మొండ్రాయిలో..

కొడకండ్ల: మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన మల్లెబోయిన నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబసభ్యులను శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, జ్యోతి, సతీష్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, తుకారాం, కన కయ్య తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో పూజారి మృతి

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన నర్సింహస్వామి ఆలయ పూజారి కేశవపట్నం శ్రీనివాస్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. పల్లెప్రకృతి వనం గుట్టపై నర్సింహస్వామికి పూజలు నిర్వహించడమే కాకుండా ప్రతి ఏటా శ్రీరామనవమికి సీతారాముల కల్యాణాన్ని నిర్వహించిన పూజారి మృతి పట్ల మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.


రామచంద్రగూడెం తొలి సర్పంచ్..

బచ్చన్నపేట: మండలంలోని రామచంద్రగూడెం తొలి సర్పంచ్ పులిగిళ్ల రామచంద్రయ్య (87) శనివారం మృతి చెందాడు. ఆయన కొన్నె, రామచంద్రాగూడెం ఉమ్మడి గ్రామాల తొలి సర్పంచ్‌గా ఎన్నికై మూడు సార్లు పదవిని చేపట్టారు. ఆయన మృతి పట్ల రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ దూడల కనుకయ్య, మాజీ సర్పంచ్‌లు నాచగోని రజిత, సుంకె లక్ష్మి, నాయకులు సంతాపం తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

పాలకుర్తి: మల్లంపల్లి గ్రామానికి చెందిన గర్వందుల అచ్చి (అశోక్) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. అచ్చికి భార్య, కూతురు ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో ఐదేళ్ల జస్విత తండ్రికి తలకొరివి పెట్టింది. ఇది చూసిన గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

స్క్రాప్ కొనుగోలు పేరిట చోరీలు



సామగ్రి ఎత్తుకెళ్తున్న మహిళలను పట్టుకున్న గ్రామస్తులు

దేవరుప్పుల: స్క్రాప్ కొనుగోలు, ఏరివేత పేరిట గ్రామాల్లోకి వస్తున్న గుర్తు తెలియని మహిళలు తాళం వేసిన ఇంటికి కన్నం వేస్తున్న సంఘటన శని వారం మండల కేంద్రంలో వెలుగు చూసింది. దేవరుప్పుల గ్రామంలోని హైస్కూల్ సమీపంలో ఇంటికి వేసి ఉన్న తాళం పగులగొట్టి యధేచ్ఛగా ఇంటి సామగ్రి సర్దుకుని ట్రాలీ ఆటోలో పరారయ్యారు. ఆ ఇంట్లో మహిళల సందడి చూసి సదరు యజమానికి సమాచారం అందించగా గ్రామస్తులు అడ్డం తిరిగి పట్టుకున్నారు. ఆటోలో ఉన్న సామాగ్రి బస్తాలను తనిఖీ చేయగా ఇంటి సామాన్లు బయటపడ్డాయి. ఈ విషయమై స్థానిక పోలీసులకు సమాచారం అందించగా చేరుకుని సామగ్రి చోరీకి పాల్పడిన నల్లగొండ జిల్లా నకరేకల్‌కు చెందిన ముగ్గురు మహిళలతోపాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని సామగ్రి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి

జనగామ రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. శనివారం పట్టణంలోని ధర్మకంచ ఉన్నత పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ అండ్ వీల్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏఎంఓ శ్రీనివాస్, ఎస్ఓ రాజు, సీఎంఓ నర్సింహరావు, ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ మంగళంపల్లి రాజు, కో ఆర్డినేటర్ ఆంజనేయులు, సిబ్బంది టీటటుజ్జీజీ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు వినియోగించుకోవాలి



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ కిషన్

కొడకండ్ల: సామాజిక సేవలో భాగంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకోవాలని క్లబ్ జోన్‌చైర్మన్ రేగూరి శ్రీదేవి కోరారు. శనివారం మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద కొడకండ్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్ల శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో 80 మందికి కంటి వైద్య నిపుణుడు కిషన్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి 42 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దామెర రవీందర్, కార్యదర్శి గాజుల రాములు, కోశాధికారి నేతి కొండయ్య, ప్రతినిధులు పాల్గొన్నారు.